

సత్యవాక్కు
సంపుటి -42
సెప్టెంబరు - 2020
సంచిక - 2
సెప్టెంబరు - 2020
క్రైస్తవ మాసపత్రిక
సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతి శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ్య పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 సెప్టెంబరు - 2020 సంచిక -2

## పాపము దాని విరుగుడు

మానవజాతికంతటికీ పాపము నుండి రక్షణ అవుసరమై యున్నది. అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (రోమా. 3:23). క్రీస్తులోనే రక్షణయున్నది గనుక క్రీస్తులో లేని యుక్తవయస్సు కలిగిన వారందరు నశించి పోవుచున్నవారు, అయితే సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమాయెను. (తీతు 2:11) కాబట్టి దేవుని కృపను మనము పొందవలెనంటే ఆయన యిచ్చు క్షమాపణను మనము చేపట్ట వలెను. పాపము యొక్క దాసత్వము నుండి మనము విమోచన నొంది క్రీస్తు యిచ్చు రక్షణా నందములో పాలు పొంద వలెనంటే ఆరు విధములయిన దుర్మార్గతను (పాపమును) మనము గుర్తించి దాని కీయబడిన పరలోక విరుగుడును గ్రహించవలెను.

**మొదటిది పాపపు ప్రేమ :** పాపము చేయువారు దానిని ప్రేమింతురు. పాపము వలన కలుగు అల్పకాలపు భోగములను

మనము జయింపవలెను. లేని యెడల క్షమాపణ దొరుకదు. "ఈ లోకము నైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి" యని భక్తుడైన యోహాను హెచ్చరించుచున్నాడు (1యోహాను 2:15). అంటే ఈ లోకములో యున్న పాపమును అనగా శరీరాశను, నేత్రాశను, జీవపు డంబమును మనము ప్రేమించ రాదు అని అతని ఉద్దేశ్యము. పాపపు భోగములను మోషే తిరస్కరించెను. తమ క్రియలు చెడ్డ వైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమింతురని నీకోదేముతో యేసు చెప్పెను. (యోహాను 3:19). పాపము నుండి విమోచింప బడవలెనంటే మానవులు పాపమును ప్రేమించుట మానుకోవలెను.

మానవులు పాపమును ప్రేమించుట వలన పాపమును అభ్యసింతురు. మానవుడు తాను ద్వేషించు దానినే అభ్యసించుట అసాధ్యము. మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి యని అపొ. పౌలు చెప్పెను: (రోమా 6:12). మరల పాపమును అభ్యసించువారు మరణమునకు తగిన వారని అతడు రోమా 1:32లో చెప్పెను. పాపమును అభ్యసించుట మనము మాను కొనవలెను.

**పాపపు స్థితిని మనము తెలిసికొనవలెను.** ఆత్మీయముగా రెండే రెండు స్థానములున్నవి. దేవుని రాజ్యము, సాతాను రాజ్యము అనునవి. అంధకార శుక్తులనుండి దేవుడు మనలను తన ప్రియకుమారుని రాజ్యములోనికి చేర్చును (కొలస్స 1:13). క్రైస్తవులు దేవుని యందును, లోక మంతయు దుష్టుని యందునుఉన్నదని యోహాను చెప్పెను (1యోహాను 5:19). పాపపు స్థితి మరణమే అని అపొ. పౌలు చెప్పెను (ఎఫెసీ 2:1). గనుక మనము పాపపు స్థితి నుండి

తప్పించు కొనవలెను.

**పాపము వలన కలుగు అపరాధమును మన మెరుగవలెను.** మనము దేవుని చట్టమును ఉల్లంఘించినపుడుఅపరాధులమని తీర్చబడుదుము. "ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు , ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయిన యెడల ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధి యగును (యాకోబు 2:10). పాపపు అపరాధము భరింపరానిది గనుక దాని నుండి మనము తప్పించుకొన ప్రయత్నించవలెను. "అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను ? ఇట్టి మరణమునకు లోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును?" అని అపొ. పౌలు తన ఆవేదనను వ్యక్తపరచెను (రోమా 7:24).

**పాపమునకు గొప్ప శక్తి యున్నది,** త్రాగుబోతులను, జూదగాళ్ళను, వ్యభిచారులను మొదలగువారిని గూర్చి ఒక్కసారి ఆలోచింపుము, పాపపు శక్తితో పోరాడు పెనుగులాటను గుర్తించుము. దాని భయంకరాకృతికి వారు ఎట్లు ఆహుతియై పోవుదురో ఆలోచింపుము. పాపమునకు జనకుడగు అపవాది యెవని మ్రింగుదునా అని గర్జించుచు సింహము వలె తిరుగుచున్నాడు. పాపి యొక్క శరీరంలో పాపము నిరంకుశ ప్రభుత్వము చేయును. పాపమునకున్న ఈ భయంకర శక్తిని మనము విచ్ఛిన్నము చేయవలెను.

పాపము వలన కలుగు నిత్య ఫలితములను ... యెరుగవలెను. పాపము వలన వచ్చు జీతము, మరణము (రోమా 6:23). ఇది కేవలము భౌతిక మరణము కాదు గాని ప్రకటన గ్రంథము 20వ అధ్యాయములో చెప్పబడిన భయంకర రెండవ మరణము, అగ్ని గంధకములు గల గుండములో పాపులు తమ కాలమును నిత్యము గడుపుదురు, అక్కడ అగ్ని ఆరదు, పురుగు చావదు

(ప్రకటన 20:10,15). పాపము వలన కలుగు ఈ ఘోర ఫలితము నుండి మనలను ఎవరు రక్షింతురు?

పాపమునకు సంబంధించిన ఈ సమస్యల న్నింటికిని దేవుడు తన కృపను బట్టి విరుగుడును మనకు దయ చేసెను, మనము జీవమును చూడ గోరుచున్న యెడల ఈ విరుగుడును తెలుసుకుని దాని ఉపయోగించ వలెను.

**పాపము యొక్క ప్రేమను, విశ్వాసము బాగు చేయును.**

పాపము మాని మన దేవుని మనము ప్రేమించుటకు విశ్వాసము సహాయము చేయుము, విశ్వాసము వలన హృదయము పవిత్ర పరచబడునని అ.పో., పేతురు పలికెను. (అ.పో. కా. 15:9). రోమాలో క్రైస్తవులు పరిశుద్ధులగుటలో క్రైస్తవులు పరిశుద్ధముగా పాపమునకు మృతులయ్యిరియని అ.పో. పౌలు వారికి జ్ఞాపకము చేసెను. (రోమా 6:2), లోకమును జయించిన విజయము మన విశ్వాసమే అని భక్తుడయిన యెహోసును వ్రాసెను (1యోహాను 5:4), దేవునియందు విశ్వాసము కలిగి యుండుట వలన పాపపు ప్రీతి మనలో నుండి తొలగించబడును.

**మారు మనస్సు పాపము యొక్క అభ్యాసమును మాన్పును,** మారు మనస్సు అనగా మనస్సు మార్చుకుని తిరుగుట అని అర్థము, అందుకే పాపము విషయమై చనిపోయిన మనము ఇక మీదట ఏలాగు దానిలో జీవించెదము? అని అ.పో. పౌలు ప్రశ్నించెను (రోమా 6:2). రక్షింప బడుటలో మనము క్రీస్తుతో కూడ సిలువ వేయబడి పాత పాప జీవితములో నుండి వేరు చేయబడవలెను (గలతీ 2:30). క్రీస్తు నందు విశ్వాసమును కలిగి తన పాపములను విషయమై నిజముగా మారు మనస్సు పొందినవాడు

అతడొకానొకప్పుడు అభ్యసించిన పాపములను తప్పక ద్వేషించును.

**పాపపు స్థితిని బాప్తిస్మము మార్చును.** పాపులందరు పాపపు స్థితిలో మరణ స్థితిలో జీవించు చుందురు గనుక రక్షింప బడినవారు రాజ్యములోనికి తప్పించు కొనుటకొక మార్గము ఉంచబడెను, దేవుడే ఆ తప్పించుకొను మార్గమును మన కొరకు ఏర్పరచెను. మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు నశించిన స్థితిలో నుండి రక్షింప బడిన స్థితిలోనికి ప్రవేశింతుము,

"క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరూ క్రీస్తును ధరించుకొని యున్నారు" అని లేఖనము బోధించుచున్నది (గలతీ 3:27). క్రీస్తులోనికి మనము బాప్తిస్మము పొందవలెను, క్రీస్తులో రక్షణ యున్నది యని గమనించుము. (2 తిమో. 2:10). గనుక మనము రక్షింపబడవలెనంటె బాప్తిస్మము పొందవలెను. దానిని గ్రహించిన వాడెవడు బాప్తిస్మము పొందకుండా యుండుట అసాధ్యము.

**క్షమాపణ పాపము యొక్క అపరాధము తొలగించును.** ఆధునిక మానవుడు ఈ అపరాధముయొక్క భారమును యెక్కువ మోయు చున్నట్లు గుచున్నది. అనేకులు తమ అపరాధమును నుండి తప్పించుకొన లేక పోవుటచే మానసిక వ్యాధులకు గురియగుచున్నారు, అయితే దేవునికి స్తుతి కలుగును గాక, క్రైస్తవులు అపరాధము నుండి విడుదల చేయబడిన వారు. బాప్తిస్మములో వారు పాప క్షమాపణను పొందిరి (అపో.కా. 2:38), తమ పాపములు కడిగివేయబడినవి (అపో.కా. 22:16), అందువలన వారు నిర్మలమైనట్టి మనస్సాక్షిని కలిగిన వారు (1 పేతురు 3:21). అందుకే "క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు" అని దైవ వేదము ఘోషించుచున్నవి. (రోమా 8:1).

**పరిశుద్ధాత్మని వరముపాపపు శక్తిని విచ్ఛిన్నము చేయును.**

పాప క్షమాపణ పొందినంత మాత్రమున పాపపు శక్తిని మరలా మనము ఎదుర్కొనవుసరము లేదని కాదు గాని పాపపు శోధనలన్నిటిని ఎదుర్కొనుటకు దేవుడు మనకు శక్తిని దయ చేయును. యేసు శోధింప బడినప్పుదు అపవాదిని పారద్రోలుటకు లేఖనముల నుపయోగించెను. అట్లే నమ్మకముగా యున్న క్రైస్తవుడు కూడా ఆత్మ ఖడ్గముగా దేవుని వాక్యమును ఉపయోగించి పాపపు శక్తి విడుదల పొందును (ఎఫెసి 6:17).

**నిత్యజీవము వలన పాపపు నిత్య ఫలితముల నుండి మనము తప్పించు కొనవచ్చును.** యేసు ఇట్లనెను: "నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచు వాడు నిత్య జీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." (యోహాను 5:24). మొదటి పునరుద్ధానములో పాలుగలవారు ధన్యులును, పరిశు ద్ధులునై యుందురు. ఇట్టి వారి మీద రెండవ మరణమునకు అధికారము లేదు ". అని ప్రకటన 20:6లో వ్రాయబడి యున్నది.

అందరిని పాపపు సంకెళ్ళ నుండి విడిపించుటకే యేసు వచ్చెను. ఆయన యందు విశ్వాసముంచి ఆయన ఆజ్ఞలకు లోబడిన వారినే ఆయన విడిపించును. నీవు పాపమునుండి స్వతంత్రుడవు కాగోరుచున్నావా?

## నీ పేరు జీవ గ్రంథములో వ్రాయబడి యున్నదా ?

గ్రంధములు విప్పబడుటయు ఆ గ్రంధమందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియలు చొప్పున మృతులు తీర్పు పొందుటయు ప్రక గ్రంధము 20:12లో చదువగలము. గ్రంధములు అనగా దేవుని గ్రంధమయిన బైబిలును సూచించుచున్నది. ఇది అనేక గ్రంధముల (పుస్తకముల) కలయిక. పాత, కొత్త నిబంధనలు 66 పుస్తకములతో నిండి యున్నవి. దేవుని గ్రంధం లేక గ్రంధములలో

వ్రాయబడి యున్న వాక్యముల యొక్క శక్తిని, ప్రభావమును వాటి తీవ్రతను గూర్చి యోహాను ఈ విధముగా చెప్పుచున్నాడు, “ఈ గ్రంధమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతి వానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా - ఎవడైనను వీటితో మరి ఏదయినను కలిపిన యెడల ఈ గ్రంధములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వారికి కలుగజేయును; ఎవడైనను తీసివేసిన యెడల దేవుడుఈ గ్రంధములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండా చేయును.” (ప్రకటన 22:18,19).

మనము దేవుని వాక్యము చదువునపుడు గాని, అర్ధము చేసుకుని అనుసరించినపుడు గాని చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి, దానితో యేమియు కలుపకూడదు, దాని నుండి యేమియు తీసివేయకూడదు, మనము వాక్యమును నమ్మి విధేయత చూపి అనుసరించవలయును. ఎందుకనగా ఆ వాక్యమును బట్టియే మనము తీర్పు తీర్చబడుదుము. క్రీస్తు ఈ విధముగా చెప్పెను “నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరించని వానికి తీర్పు తీర్చువాడు ఒకడు కలడు, నేను చెప్పిన మాటయే అంత్య దినమునందు వానికి తీర్పు తీర్చును (యోహాను 12:48). అయితే మనము దేవుని ఈ మాటలను ఎక్కడ కనుగొనగలము ? యోహాను చెప్పిన ఈ గ్రంధములు (ప్రకటన 20:12 యందే కదా ! కాబట్టి మానవుడు ఈ గ్రంధ... ...ండ అనగా బైబిలు నందు వ్రాయబడిన వాక్యములను బట్టియే తీర్పు తీర్చబడును అనునది నిర్వివాదము గనుక మనము దేవుని వాక్యము గౌరవిం విధిగా అంగీకరించవలసిన అవసరత ఎంతో కలదు. దేవుని వాక్యమును సమ్మతించాలి ఆ గొప్ప తీర్పు దినమున మనమంతా ఆయన యెదుట అంగీకరింపబడాలి.

**జీవ గ్రంథము**

ప్రకటన గ్రంథము 20:12 లోనే వేరొక గ్రంథము గూర్చి వ్రాయబడి యున్నది. అదియే జీవ గ్రంథము దేవునికి చెందిన వారు లేక దేవునికి విధేయులయిన వారి పేర్లు ఆ గ్రంథమందు ఉండునని చెప్పబడుచున్నది. ఆ గ్రంథము విప్పబడినది అనగా ఒకరి పేరు అందున్నదో లేదో తెలుసుకొనుటకు తెరువబడినది అని దాని అర్థం. ఎవరి పేరు అయినా అందులో లేనట్లు అతడు పరలోక ప్రవేశమునకు అనర్హుడు.

బహుశా దేవుని యొద్ద మన వద్దనున్నటు వంటి పుస్తకము లేక గ్రంథము లాంటిది ఏదో ఒకటి యున్నదని అందులో ఇయనకు విధేయు లయిన వారి పేర్లు వ్రాయబడి యున్నవని నీవను కొనుచున్నావా? మన మధ్య ఇప్పుడు కాగితముపైసిరాతో ముద్రింపబడిన దేవుని వాక్యము గ్రంథరూపంలో యున్నది. ఇటువంటిది ఏదో ఒకటి పరలోకములో దేవుని యొద్ద గలదని తలంచవద్దు. ఆయన చెప్పిన జీవగ్రంథమను మాట అలంకరరూపముగా చెప్పబడినది. దేవుని వాక్యముచే రక్షించబడి పరలోక ప్రవేశానికి అర్హులు అయినవారి పేర్లు ఆయన జ్ఞాపకములో ఉండుటయే ఒక (రికార్డ్) ను సూచించు చున్నది. మరి ఎక్కువగా ఆయనకు చెందిన వారెవరో ఆయనకు తెలుసు; వారి పేర్లు తెలుసు. రక్షింపబడిన వారెవరో ఆయనకు గుర్తే. ఆయన మదిలో ముద్రితమై జ్ఞాపకం ఉన్న పేర్లనే జీవగ్రంథమందు వ్రాయబడి యున్నవని అలంకారంగా చెప్పబడి యుండును.

దీనితో సమాన భావము గల దానిని అపొస్తలుల కార్యములు 2 : 47లో చూడగలము “మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘము)

తో చేర్చు చుండెను". ఇంకా విపులముగా చెప్పాలంటే క్రీస్తు సువార్తకు విధేయులైన వారిని గుర్తించి వారిని సంఘములో చేర్చుచుండెను. ఆ సంఘము ప్రభువు యొక్క ఆత్మీయ కుటుంబము. ఈ విధముగా ప్రతి వారి పేరు జీవగ్రంధములో వ్రాయబడును. ప్రభువు అందరిని తన సంఘంలో చేర్చుకొనరు. తన చే గుర్తింపబడినవారిని మరియు తన చిత్తప్రకారము చేయువారినే చేర్చుకొనును. ఈ విధముగా దేవుడు మానవుని తన వానిగా జ్ఞాపక ముంచుకొనును.

నూతన యెరూషలేము అయిన పరలోక పట్టణములో దుర్మార్గులు, చెడ్డవారు, భక్తిహీనులు, పాపులు, అవిధేయులు ప్రవేశింపరు. అయితే గొర్రెపిల్ల యొక్క జీవగ్రంధమందు వ్రాయబడివారే అందులో ప్రవేశింతురు (ప్రకటన 21:27). మరియు ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనపడని యెడల వాడు అగ్ని గుండములో వడ వేయబడును." (ప్రకటన 20:15) అని వ్రాయబడి యున్నది.

అపొస్తులుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాస్తూ "కావున నేనపేక్షించు నా సహోదరులారా ! నా ఆనందమును నా కిరీటమునై యున్న నా ప్రియయులారా యిట్లు ప్రభువు నందు స్థిరులై యుండుడి. ప్రభువు నందు ఏకమనస్సు గలవారై యుండుడని యువొదియను, సుంటు కేను ... ...లు కొనుచున్నాను. అవును నిజమైన సహకారీ ఆ స్త్రీలుక్లెమెంతు తోను నా ఇతర సహకారులతోను సువార్త పనిలో నాతో కూడా ప్రయాస పడిన వారు గనుక వారికి సహాయము చేయుమని నిన్ను వేడు కొనుచున్నాను. ఆ సహకారుల పేర్లు జీవ గ్రంథమందు వ్రాయబడి యున్నవి" ఫిలిప్పీ (4:1-3). పౌలు అట్లు ఎలా చెప్పగలిగెను? వారి

ేర్లు జీవగ్రంథములో వ్రాయబడి యున్నవని పౌలుకు ఎట్లు తెలిసెను? ంల యనగా అతను దేవుని పరిశుద్ధ ఆత్మచే ప్రేరేపింపబడి దేవుడు తన కిచ్చిన జ్ఞానముతో వారు ప్రభువునకు విధేయులై రక్షింపబడిరని, సంఘముతో చేర్చ బడిరని, నమ్మకమైన క్రైస్తవులని వీటన్నిటిని బట్టి సంపూర్ణ విశ్వాసముతో వారి పేర్లు జీవగ్రంథ మందు కలవని చెప్పెను.

### మరలా పాపము చేస్తే?

జీవగ్రంథమందు వ్రాయబడిన తరువాత మానవుడు మరలా పాపము చేసి తప్పిపోయిన యెడల అతని పరిస్థితి ఏమిటి? ఇది ఆలోచించవలసిన విషయమే. ఖచ్చితముగా అతని పేరు జీవ గ్రంథము నుండి తొలగింప బడవచ్చు. దీనికి సమాధానముగా ఒకసారి గతాన్ని తలచుకొందుము. మోషే ధర్మశాస్త్రాన్ని పొందడానికి సీనాయి కొండ ఎక్కిన సమయంలో ఇశ్రాయేలీయులు అహరోను సహకారంతో ఒక బంగారు దూడను చేసి పూజించుచుండిరి. మోషే తిరిగి చూసి కోపపడి లేవీ కుమారులను పాళెములోనికి పంపి కత్తివాత చంపించెను. వారి సంఖ్య 3000. "మరునాడు మోషే ప్రజలతో మీరు గొప్ప పాపము చేసితిరి గనుక యెహోవా యొద్దకు కొండ ఎక్కి వెళ్ళెదను; ఒకవేళ మీ పాపమునకు ప్రాయశ్చిత్తము చేయగలనేమో అనెను. అప్పుడు మోషే యెహోవా వద్దకు వెళ్ళి అయ్యో ఈ ప్రజలు గొప్ప పాపము చేసిరి. వారు బంగారు దేవతను తమ కొరకు చేసికొనిరి; అయ్యో నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా లేని యెడల నీవు వ్రాసిన నీ గ్రంథములో నుండి నా పేరు తుడిచివేయుమని బతిమాలు కొనుచున్నాననెను. అందుకు యెహోవా ఎవడు నా యెదుట పాపము చేసెనో వానినే నా

గ్రంథములో నుండి తుడిచి వేయుదును" అని చెప్పెను. (నిర్గమ 32:30-33)

అవును నిజముగా ఒకని పేరు జీవగ్రంథము నుండి చెరిపి వేయుటకు గాని, ఉంచుటకు గాని ప్రభువునకు సర్వాధికారం కలదు. ఒకని పేరు జీవగ్రంథము నుండి తీసివేయబడెననగా అతని అవిధేయతను బట్టి దేవునికి అయిష్టత కలిగెను అని గ్రహించ గలము. అతడు మారుమనస్సు పొందక అదే అవిధేయతతో నిలిచి యుండి చనిపోయినట్ల అయితే ఖచ్చితముగా అతని పేరు జీవగ్రంథములో లేకపోవుటయు, కడకు అగ్ని గుండములో పడవేయబడుటయు జరుగును. (ప్రకటన 20:15). ఒకని పేరు జీవగ్రంథమందు తుడిచివేయబడిన యెడల అతడు మారు మనస్సునొంది పశ్చాత్తాపము పడి తన పాపములను ఒప్పుకొనిన యెడల అతని పేరు తిరిగి జీవగ్రంథములో చేర్చబడుటకు అవకాశం గలదు (యాకోబు 5:6).

ఇంతమంది పేర్లను దేవుడు ఎలా జ్ఞాపకం ఉంచకోగలడని ఆశ్చర్యం కలుగుతుంది. కాని ఆయనకు సమస్తము సాధ్యమే. భూమి మీద నున్న ప్రతి ఆత్మ ఉనికి ఆయనకు తెలుసు. ఒకని విధేయత వలన అతని రక్షించి సంఘముతో చేర్చును. (మార్కు 16:16 అ.పొ.; 2:38; 2:47).

ఆ సమయమందే అతని పేరు జీవగ్రంథములో రక్షింప బడినవారి సరసన చేర్చబడును.

దేవుడు ఇదంతా చేయునని ఎట్లు నమ్మడము? ఒకనికి తాను రక్షింబడ్డానని తన పేరు జీవగ్రంథములో లిఖించ బడినదని తాను చనిపోయిన తరువాత పరలోకములో ప్రవేశిస్తానని ఎట్లు తెలుసుకోగలడు? పరిశుద్ధ లేఖనములని బట్టి దేవుని

వాక్యమును బట్టి ఆయన నమ్మకమైన వాగ్దానములను బట్టి ఆయన ఆజ్ఞలకు విధేయులమై రక్షింప బడినామని మన పేర్లు జీవగ్రంధమందు చేర్చబడి యున్నవని నిత్య జీవములో ప్రవేశిస్తామను విశ్వాసమును బట్టియే తెలుసుకోగలము.

తీర్పు సమయమున ప్రభువు మనలను వ్యక్తిగతముగా గుర్తించుకొనుటయే గాక మన పనులు, మన ఆలోచనలన్నియు జ్ఞాపకం ఉంచుకొనును. పౌలు ఈ విధముగా అంటున్నాడు: "ఎందుకనగా తాను జరిగించిన క్రియలు చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతి వాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావల యును" (2 కొరింథి 5:10). యేసుక్రీస్తు యిట్లనెను : "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును" (మత్తయి 12:36). హెబ్రీయుల పత్రిక లేఖకుడు ఇట్లు అనెను:

"మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు మనము ఎవనికి లెక్క ఒప్పచెప్ప వలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా ఉన్నది" (హెబ్రీ 4 : 13). దీనిని బట్టి మనము మాట్లాడిన ప్రతిమాట చేయు ప్రతి పని మరుగు లేక ఆయనకు కనబడును కనుక వాటిని బట్టే తీర్పు తీర్చ బడుదునని తెలియు చున్నది. ఒకవేళ మన పాపములన్నియు క్షమించ బడి నట్లయిన మన పేరు జీవగ్రంధములో లిఖించబడి వరలోకములో నివాసము దొరుకును. అట్లు గాక మనము పాపములోనే నిలచి ఉంట మన పేరు జీవగ్రంధములో యుండదు. అగ్నిగుండములో పడవేయబడుదుము.

ఇప్పుడు ఒక పెద్ద ప్రశ్న మన పై నున్నది. అదేమనగా మన పేర్లు జీవగ్రంధములో నున్నవా? లేక తీసివేయబడినవేమో? ఇంకను సమయము మించిపోలేదు. దేవుని వాక్యమునకు విధేయులై దాని ప్రకారము నడుచుకొనుట వలన ఖచ్చితముగా మన పేర్లు జీవగ్రంధమందు చేర్చబడును.

– జె.సి. ఛోట్

# సంఘ చరిత్రావ లోకనము

**పరిచయము :**

పాత నిబంధనలో దేవుని ప్రజల యొక్క చరిత్ర, నమ్మ కత్వము, విశ్వాస భ్రష్టత్వము, మారు మనస్సు, పునరుద్ధరణయై యున్నది. సంఘ చరిత్ర విషయములో కూడ యిది సత్యము, బైబిలును చదివిన తరువాత సంఘ చరిత్రను చదివితే క్రైస్తవునికి అది విలువయిన పఠనమగును.

**1. ఆదిలో సంఘము పవిత్రముగా యుండెను.**

అది క్రీస్తుచే నిర్మించబడెను (మత్తయి 16:18), అది యెరూషలేములో పెంతెకోస్తు దినమున ఆరంభించబడెను. (అ.పొ.కా. 2), రాజ్యమైన సంఘము యొక్క విత్తనముదేవుని వాక్యము (లూకా 8:11).

**2. ఆదిమ మాదిరి నుండి తొలగి పోవుదురని ప్రకటించ బడెను.**

అబద్ధ ప్రవక్తలను గూర్చి యేసు హెచ్చరించారు. (మత్తయి 7:15). పౌలు అబద్ధ బోధకులను గూర్చి హెచ్చరించాడు (అ.పొ.కా. 20 :28–32). విశ్వాస భ్రష్టత్వము సంభవించునని ముందుగానే చెప్పబడెను (2థెస్స 2:1–10). కొందరు విశ్వాసము నుండి తొలగిపోవుదురని ఆత్మ తేటగా చెప్పియున్నాడు. (1తిమో. 4:1–3).

**3. క్రొత్తనిబంధన మాదిరి నుండి ప్రారంభములో దిగువ రీతిగా తొలగిపోయిరి :**

**ఎ) పోపు అనే సంస్థ మొలకెత్తెను :**

రెండవ శతాబ్దములో స్థానిక సంఘములో అధ్యక్షత వహించు పెద్ద "బిషప్పు' గా మార్పుజెందెను.

త్వరలో పలుకుబడి గల సంఘము యొక్క బిషప్పు మిగతా సంఘముల పై ఏలుబడి ప్రారంభించెను.

నాల్గవ శతాబ్ధము వచ్చుసరికి రోమ్, కాన్‌స్టాంటినోపిల్. అంతియొకయ, అలెగ్జాండ్రియ, యెరూషలేములో యున్న పెద్దలు ఏలుబడి చేయనారంభించిరి. క్రీ॥ శ॥ 606 లో బోనిఫేస్ - 3 అనువాడు "సార్వజనిక బిషప్పు" అనే బిరుదును ధరించి మొదటి పోప్ అయ్యెను.

**బి)మతగురువులు ఉద్భవించుట :** యూదుల యొక్కయు, అన్యమతస్థుల యొక్కయు మాదిరిగా సంఘములో ప్రత్యేక మత గురువులు ఉద్భవించిరి.

గురువులు మాత్రమే బోధించాలి. ప్రభురాత్రి భోజనం ఈయాలి, బాప్తిస్మమియ్యాలి, పెండ్లిండ్లు చేయాలి. అంతిమక్రియలు చేయాలి అను అబద్ధపు బోధలు ప్రవేశపెట్టబడెను.

క్రీ॥ శ॥ 1075 నాటికి పోప్‌గ్రెగరీ -8 అనువాడు ఈ మత గురువులు బ్రహ్మచర్యము పాటించాలని శాసించాడు.

**సి) విశ్వాసప్రమాణములు, కౌన్సిళు ళ్ల :** వివాద పరిష్కారము కొరకు రెండవ శతాబ్ధము నాటికే కౌన్సిళ్ళు ఏర్పడెను. మొట్టమొదటి విశ్వాసప్రమాణము క్రీ॥ శ॥ 325లో నైసియాలో వ్రాయబడెను.

**డి) శిశు బాప్తిస్మము :** ఆదిమపాపము అనే అబద్ధ సిద్ధాంతము రెండవ శతాబ్ధములోనే ఆరంభమాయెను. దానిని అగస్టీస్ అనేవాడు గొప్పగా వ్యాప్తిచేసెను.

ఆదిమపాపము అనే సిద్ధాంతము శిశుబాప్తిస్మమునకు దారి తీసినది.

**ఇ) చిలకరింపు, కుమ్మరింపు :** క్రీ॥ శ॥ 251 లో నోవోషియన్ అనే రోగి తనమంచము పైనే నీటితో చల్లించబడెను. అది కుమ్మరింపాయెను.

క్రీ॥ శ॥ 1311లో రావెన్నలో జరిగిన కౌన్సిల్‌లో చిలకరింపు కుమ్మరింపులు ముంచడము వలె బాప్తిస్మమేయని ఆమోదించబడెను.

**ఎఫ్) వాద్య సంగీతము, క్వాయర్‌లు ప్రవేశము :**

క్రీ॥ శ॥ 660లో పోపు వైటాలియన్ అను నతడు క్రైస్తవారాధనలో మొట్ట మొదటిగా వాద్య సంగీతము ప్రవేశపెట్టెను. 1250వ సంవత్సరము వరకు కేథలిక్కు సంఘము దానిని తిరస్కరించుచువచ్చెను.

నాల్గవ శతాబ్ధములో ప్రత్యేకముగా పాటలు పాడే గుంపులు (కోరస్) ఏర్పడెను.

**జి) మాస్ అనబడే కేథలిక్కు ఆరాధన :**

రెండవ శతాబ్ధములో కొద్దిమందికే ప్రభు రాత్రి భోజనం అను ఆచారము మొదలిడెను. ఒకే పదార్ధము (రొట్టె మాత్రమే) అను అబద్ధపు బోధ 12వ శతాబ్ధములో ఆరంభమాయెను. క్రీ॥ శ॥ 1251లో లేటరన్ కౌన్సిల్‌లో రొట్టె ద్రాక్షారసములు నిజముగా క్రీస్తు శరీర, రక్తములుగా మారుననే సిద్ధాంతము ప్రవేశపెట్టబడెను.

**హెచ్) మరియను ఆరాధించుట :**

క్రీ॥శ॥ 431లో ఎఫెసులో జరిగిన కౌన్సిల్ తరువాత "దేవుని తల్లియైన మరియ అను పదజాలము వాడుకలోనికి వచ్చెను. 1854లో మరియ "పాపరహిత గర్భధారిణి" అనే సిద్ధాంతము ప్రవేశపెట్టబడెను.

**1. ప్రతిమలను పూజించుట :**

ప్రతిమలను పూజించే

...రాచారము కేథలిక్కుల సంఘములోనికి ప్రవేశపెట్టిరి. మృతులయిన పరిశుద్ధుల యొక్క నీతి జీవించువారికి ఆపాదించ వచ్చునని వారు బోధింప మొదలిడిరి. అందువలన పాప క్షమాపణ పత్రముల విక్రయములు ప్రారంభించబడెను.

**జె. మత సంబంధ పండుగలు మరియు సెలవు దినములు :**

యూదుల యొక్కయు అన్య మతస్థుల యొక్కయు పండుగలు క్రైస్తవ్యములోనికి తేబడెను. నైసియాలో జరిగిన కౌన్సిల్ క్రీ॥శ 325లో ఈస్టర్ పండుగ చేయవలెనని ఉత్తర్వులు జారీ చేసిరి.

**కె. రోమన్ కేథలిక్‌లకు పలుమార్లు ప్రతి పక్షము ఎదురాయెను :**

క్రీ॥శ॥ 1054లో గ్రీక్ ఆర్థోడాక్స్ సంఘము కేథలిక్కుల నుండి విడిపోయెను. 1150లో పీటర్ వాల్డో అనునతడు క్రొత్త నిబంధనను ప్రజలు బాషలోనికి తర్జుమా చేసెను. దానిని కేథలిక్కులు వ్యతిరేకించిరి. బొహెమియాకు చెందిన జాన్ హస్ అనునతడు అందరు బైబిలు నొద్దకు మరలాలని హెచ్చరించాడు. అయితే 1415లో కేథలిక్కులు అతనిని ప్రాసుకు కట్టి కాల్చి వేసిరి. 1382లో జాన్ విక్లిఫ్ అనునతడు బైబిలును ఇంగ్లీషులోనికి తర్జుమా చేసెను. అతడు సవరణోద్యమము యొక్క ఉదయ నక్షత్రము అని పిలువబడెను.

**ఎల్ :ప్రొటెస్టాంటు సవరణోద్యమము రోమన్‌కేథ లిక్కుల నడ్డి చాలమట్టుకు విరిచెను.**

1517లో కేథలిక్కుల గురువైన మార్టిన్ లూథరు పాపక్షమాపణ పత్రముల విక్రయమును సవాలు చేసెను. 1530లో లూథరన్లు "ఆగ్స్‌బర్గ్ కనఫెషన్ ఆఫ్ ఫెయిత్" అనే ప్రమాణ పుస్తకమును రచించి అంగీకరించిన మొట్టమొదటి ప్రొటెస్టాంట్ డినామినేషన్ అయ్యిరి. 1534లో ఇంగ్లాండు చక్రవర్తి అయిన హెన్రీ 8 అనునతడు

కేథలిక్కుల నుండి విడిపోయి చర్చ్ ఆఫ్ ఇంగ్లాండుకు శిరస్సాయెను. ఆల్‌రిక్ జ్వింగ్లీ అను స్విస్ సంస్కరణ కర్త కొత్త నిబంధనకు దగ్గరగా యుండెను.

జెనీవాలో జాన్‌కేల్విన్ అనునతడు ఈ సవరణోద్యమమునకు సారధ్యము వహించెను. 'క్రైస్తవ మతము యొక్క విధులు అను దానిని అతడు ప్రచురణ పరచెను.

స్కాట్‌ల్యాండ్‌లో జాన్‌నాక్స్ అనునతడు సవరణోద్యమమును నడిపించెను. తత్ఫలితముగా ప్రెస్బిటేరియన్ సంఘము ఆరంభించబడెను.

**ఎమ్ : పునరుద్దరణ ఉద్యమము విశ్వాసులను తిరిగి బైబిలు నొద్దకు సంపూర్ణముగా జేర్చెను.**

క్రీ॥శ॥ 1800 సంవత్సరములో మనము బైబిలు నొద్దకు తిరిగి వెళుదము అని ప్రజలు విజ్ఞాపనలు ప్రారంభించిరి. అప్పుడున్న కేథలిక్కు ప్రొటెస్టెంటు సంఘములను సవరించుట కంటే క్రీస్తు సంఘమును పునరుద్ధరించుదాం అని వారు తలచిరి. అమెరికాలో ఈ పునరుద్దరణ ఉద్యమమునకు థామస్ కేంబెల్ అలెగ్జాండరు కేంబెల్, వాల్టర్ స్కాట్, బార్టన్ స్టోట్, అనువారలు ముఖ్యనాయకులు.

**ముగింపు :**

చరిత్రయొుక్క పాఠము నేర్చుకొనని వారు దాని పొరబాట్లను తిరిగి చేసే ప్రమాదమున్నది. అన్ని కాలములలోను బైబిలు మాత్రమే ప్రామాణికము. ప్రతి ఉద్యమము దాని ఫలితములున్ను బట్టి కొలువవలెను.

**– రూధర్‌ఫర్డ్**

# ఒక సమరయ స్త్రీ యొక్క ప్రభావము

భూమి మీదనున్న ప్రతి వారు మరియొకరిపై ప్రభావము కలిగి యుందురు. కొందరు తమ పేరు ప్రఖ్యాతులను బట్టి, తమ నాయకత్వమును బట్టి, అనేకుల పై ప్రభావమును కలిగి యుందురు. కొందరు పరోక్షముగాను మరి కొందరు ప్రత్యక్షముగాను ఈ ప్రభావము కలిగి యుందురు.

యేసు ప్రభువు గలిలియలోని యూదయకు ప్రయాణము చేయుచుండగా ఆయన సమరయ గుండా వెళ్ళవలసి వచ్చెను. ఒక బావి యొద్ద విశ్రాంతి కొరకు ఆయన నిలిచెను. ఆహారము కొనితెచ్చుటకు ఆయన శిష్యులు పట్టణములోనికి వెళ్ళిరి. ఆయన వారికొరకు కనిపెట్టుచుండగా పట్టణము నుండి సమరయ స్త్రీ ఒకతె నీళ్ళు చేదుకొనుటకు ఆ బావి వద్దకు వచ్చెను. యేసు ఆమెను దాహమునకిమ్మని అడిగెను. ఆమె ఆశ్చర్యపోయింది ఏలయనగా యూదులు సమరయులతో సాంగత్యము చేయరు, యేసు ఆమెతో క్లుప్తముగా సంభాషించిన తరువాత "అయ్యా నీవు ప్రవక్తవని గ్రహించుచున్నానని" ఆయనతో చెప్పెను.

ఒకానొక దినము వచ్చు చున్నది, ఆ కాలమందు ఆరాధించే స్థలము ప్రాముఖ్యము కాదు దేవుడు ఆత్మ గనుక ఆయనారాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెనని యేసు ఆమెతో చెప్పెను. (యెహాను 4:24). ఆయనే వారెదురు చూచుచున్న మెస్సీయ యని ఆమెకు ఆయన చెప్పెను.

ఆయన మాటల వలన ఆమె గొప్పగా ప్రభావితురాలై తన కుండను బావి యొద్దనే విడచిపెట్టి

పట్టణములోనికి వెళ్ళి ఆయనను గూర్చిన వార్త వారికి తెలియజేసెను. ఆమె యేసుతో చేసిన సంభాషణగూర్చి వారికి చెప్పగా అనేకులు విశ్వసించి యేసును చూడవచ్చిరి. వారితో కొన్ని దినములు గడుపవలెననని కోరగా ఆయన రెండు దినములు అక్కడ ఉండి వారికి బోధించెను. ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి ఇకమీదట నీవు చెప్పిన మాటను బట్టి గాక మా మట్టుకు మేమే విని ఈయన నిజముగా లోక రక్షకుడని తెలుసుకుని నమ్ముచున్నామనిరి. (యోహాను 4:41-42).

**సమరయ స్త్రీ యెట్టి ప్రభావమ కలిగి ఉండెను ?**

ఆమె యేసును కలువక ముందు తాను పట్టణములో ఏమంత మంచి పేరు కలిగినది కాదు. ఆమె అక్రమ సంబంధములతో జీవించుచున్న స్త్రీ. దానిని గూర్చి పట్టణమంతయు ఎరిగి యుండిరి. అప్పటికే ఆమెకు 5గురు పెనిమిట్లు ఉండిరి. కాని ప్రస్తుతము ఉన్నవాడు తన భర్త కాదు. గాని ఈ రోజైతే ఆమె యొక్క ప్రభావము మంచి కొరకే ప్రభావించెను. తనకున్న చెడ్డ పేరును బట్టి ఆమె మౌనముగా యుండలేదు. ఆమె వద్ద యేసును గూర్చిన గొప్ప వర్తమానమున్నది. దానినియితరులకు తెలియజేయుటకు నిశ్చయించుకున్నది. [illegible] మాట విని కొందరు వెంటనే యేసునందు విశ్వాసముంచిరి. మరికొందరు ఆమె చెప్పిన దానికంటే ఎక్కువ తెలుసుకుని స్వయముగా యేసునందు విశ్వాసముంచిరి. ఆమె వలన యేసు తమతో కొన్ని దినములు గడపవలెనని ఆ పట్టణస్థులు యేసును ఆహ్వానించిరి. ఆయన అక్కడ ఉండగా మొదట ఆయన యందు విశ్వాసముంచని

వారికి బోధించెను. ఆ సమరయ స్త్రీ యేసును గూర్చి వారికి చెప్పక యుంటే వారాయన యందు విశ్వాముంచియుండక పోదురు.

**సమరయ స్త్రీ నుండి మనము ఏమి నేర్చుకొనగలము ?**

రక్షకుని గూర్చి నీవు ఎన్నడు మౌనముగా యుండకుము. యేసును గూర్చి నీకు తెలిసినది ఇతరులకు చెప్పుము. వారికి బైబిలును బోధించుము. దేవుని వాక్యమును బట్టి వారు విశ్వాసులగునట్లు చేయుము.

అనుకున్న దాని కంటే మన ప్రభావము చాలా చోట్ల యుండును. మనము ప్రభావి తులను చేసిన వారు ఇతరులను ప్రభావితులను చేస్తారు.

నీ జీవితములో అవుసరమయిన మార్పులు చేసుకొనుటకు ఇదియే మంచి సమయము. గతంలో మనము ఎంత పాపపు జీవతమును జీవించినా మన ప్రవర్తనను మనము మార్చుకోగలము. ఈలోకంలో మంచిని ప్రభావితం చేయగలము.

ఈ సమరయ స్త్రీ నుండి మనము నేర్చుకోగలిగినదంతా నేర్చుకొందము. యేసును గూర్చిన మంచి వార్తను ఇతరులకు అందించుటకు ప్రయత్నము చేయుదుము గాక !

– సూజీఫ్రెడరిక్

మీరు సత్యవాక్కు సంవత్సర సభ్యత్వ రుసుమును చెల్లించారా?
లేని యెడల ఇప్పుడే చెల్లించండి, ఎమ్.ఓ. ద్వారా గాని లేదా
ఫోన్ పే ద్వారా గాని చెల్లించవచ్చును.
ఫోన్ పే నెంబరు : 9912286255

# సంక్షిప్త వార్తలు

కరోనా కోవిడ్ -19 యొక్క సంక్షోభం ఇంకను భారతదేశంలోను, ప్రపంచమంతటా కొనసాగుచునేయున్నది. ప్రపంచ మంతటా యున్న శాస్త్రజ్ఞులు దాని విరుగుడు కనుగొనే విషయంలో నిమగ్నులై యున్నారు. ఏదేని ఈ సంవత్సరాంతమునకు ఒక వేక్సిన్ రాగలదనే నిరీక్షణ ప్రజలలో యున్నది.

2020 ఫిబ్రవరిలో ఈ కరోనా విపత్తు ప్రారంభించబడినను లాక్‌డౌన్, కర్ఫ్యూ కొనసాగించబడినను గత నెలలన్నిటిలో సత్యవాణి ఆఫీసు, స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్ నిరాటంకముగా కొనసాగుచునే యున్నవి. అయితే స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్‌లో యున్న ఒక టీచరుకు, ఒకరిద్దరు విద్యార్థులకు కరోనా సోకడం వలన పది రోజులు మట్టుకు అనగా ఆగస్టు 14వ తేది నుండి 24వ తేది వరకు సత్యవాణి ఆఫీసు మూసివేయబడినది.

అయితే స్థానిక సంఘము మట్టుకు ప్రతి ఆదివారము తప్పక కూడుకొనుచుండిరి. ఆరాధనకు హాజరు కాలేని వారు తమ ఇండ్లలో ఆరాధన జరిపించుకొనేవారు. ఆదిమ సంఘము, అపొస్తలుల బోధ యందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, నిలకడగా యుండిరి. కనుక నిజ క్రైస్తవులందరు ప్రతి ఆదివారము గృహాలలో గాని, సంఘముగా గాని తప్పక కూడుకొని ఆరాధనలో పాల్గొనవలయును. దానిలో రొట్టె విరుచుట ఒక భాగమై యున్నది.

కరోనా విపత్తు వలన కలిగిన సంక్షోభంలో యున్నవారిని స్థానిక సంఘము తరపున కాకినాడ రోటరీ తరపున రిక్కీ గూటం గారు అనేక వేల మందికి ఆహార సామాగ్రిని, మాస్కులను, ఫేస్ హెల్మెట్‌లను ఉచితముగానే అందజేసిరి. మరీ ముఖ్యముగా అటు పోలీసు శాఖలో పనిచేయుచున్న వారికి, గవర్నమెంట్ హాస్పిటల్‌లో పని చేయుచున్న వైద్య బృందమునకు, నర్సులకు, శానిటరీ పని వారికి కోవిడ్ నుండి రక్షించుకునే పరికరములను, శానిటైజర్లను,

మాస్కులను, వైద్య రక్షణ కవచములను మొదలగు వాటిని రిక్కీ గూటం గారునిరంతరం సరఫరా చేయుచునే యున్నారు. " మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న దేవుని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి" యని యేసుప్రభువు బోధించారు (మత్తయి 6:15). రిక్కీ గారు చేయుచున్న మంచి కార్యములను గూర్చి తరచు స్థానిక టి.వి. ఛానెళ్ళలోను, వార్తా పత్రికలలోను ప్రసారము చేయబడేది.

రాజమండ్రి గణేష్‌నగర్ క్రీస్తు సంఘ సువార్తికులు బ్రదర్. ఎమ్. కిరణ్‌కుమార్ గారు ఆగస్టు 15వ తేదీన కరోనా సంబంధిత వ్యాధి వలన ప్రభువునందు నిద్రించిరి. ఆయన కుటుంబమునకు, స్థానిక సంఘమునకు ఆదరణ కలుగునట్లు అందరూ ప్రార్థించ మనవి.

స్కూల్ ఆఫ్ ఎవాంజిలిజమ్‌లో మీరు ఆన్‌లైన్‌లో కూడా చేరవచ్చును. వివరముల కొరకు అప్లికేషన్ కొరకు డైరక్టర్ రోనీ గూటం గారిని గాని, 9848998547కు గాని ఫోన్ చేయండి.


RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-2020

సత్యవాక్కు
పోస్టుబాక్సు-80
కాకినాడ - 533 001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేదీ: ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ: ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ 533004